
సాక్షి
గుంటూరు
ఆదివారం । 15 । సెప్టెంబర్ । 2024



అంకమ్మ తల్లికి వెండి వితరణ

దాచేపల్లి: స్థానిక వీర్ల అంకమ్మ తల్లికి దాచేపల్లికి చెందిన దేవరశెట్టి బాలాంజనేయులు కుటుంబ సభ్యులు రూ.10లక్షలు విలువ చేసే వెండిని కమిటీ సభ్యులకు అందజేశారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 3506 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 975 క్యూసెక్కులు వదిలారు.



44.59 టీఎంసీలు నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తి 61,071 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు నీటి నిల్వ 44.59 టీఎంసీలు.

చాలా నష్టం



మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించాలనే ఆలోచన, సీట్లు తగ్గించడంతో.. ఎన్నో ఆశలతో ఉన్న తాము నష్టపోయే అవకాశం ఉంది. ఎంతో సమయం, నగదు ఖర్చు చేసి లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటున్నాను. మంచి ర్యాంకు సాధించినా సీటు వస్తుందో, రాదోననే భయాందోళన చెందుతున్నాను. మాలాంటి వారికి వైద్యవిద్య కలగానే మిగిలిపోవాలా ? న్యాయం చేయడానికి చర్యలు తీసుకోవాలి.

- ఎం.త్రివిక్రమరాజు, నీట్ విద్యార్థి, మచిలీపట్నం



పెదకాకాని మండలం తంగెళ్లమూడి, వెంకటకృష్ణాపురంలో వర్షాలకు పూర్తిగా పాడై పోయిన వరి పంట



ఈ చిత్రంలో కనిపిస్తున్న ఈ రైతు పేరు సిద్దంశెట్టి వల్లభరావు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పూర్తిగా వ్యవసాయాన్నే నమ్ముకున్న వల్లభరావు ఈ ఏడాది తనకున్న ఐదెకరాల భూమితో పాటు మరో పదకొండు ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. అందులో వరి పైరు సాగు చేశాడు. ఇప్పటి వరకు కౌలు ఎకరాకు భూమిని బట్టి రూ. 21 వెయ్యి నుంచి రూ. 25 వేల వరకు చెల్లించడంతో పాటు వ్యవసాయానికి, పంటకు రూ. 20 వేల వరకూ పెట్టుబడులు పెట్టాడు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద నీరు పొలాల్ని ముంచెత్తడంతో పంట పూర్తిగా వాలిపోయింది. ప్రభుత్వం ఇప్పటి వరకూ ఎలాంటి సాయమూ అందించలేదు. ఏమి చేయాలో పాలుపోని వల్లభరావు మరలా అప్పులు చేసి పెట్టుబడులు పెడుతున్నాడు. ఇప్పటి వరకు కౌలుకు గానీ వ్యవసాయానికి గానీ ఐదు లక్షలరూపాయల వరకూ పెట్టుబడులు పెట్టాడు. ఇంతా చేసినా వరదల ప్రభావం దిగుబడులపై పడనుంది. గతంలో 35 నుంచి 40 బస్తాలు వచ్చే దిగుబడులు ఇప్పుడు 20 కూడా సందేహమే. ఇది ఈ ఒక్క రైతు పరిస్థితి కాదు..వరదల ప్రభావంతో దెబ్బతిన్న ఎందరో రైతుల పరిస్థితి.



వరద నీరు పొలం నుంచి ఎప్పుడు పోతుందా అని ఎదురు చూస్తే నిరాశే ఎదురైంది. పది రోజుల తర్వాత పొలం నుండి నీరు బయటకు పోయింది గానీ పైరు మాత్రం కుళ్లిపోయి చేతికి రాలేదు. ఎకరం 19 బస్తాలు చొప్పున కౌలు చెల్లించి మూడు ఎకరాలు కౌలుకు సాగు చేస్తున్నా. ఎకరం కూడా సొంత భూమి లేదు. చిన్నప్పటి నుంచి వ్యవసాయాన్ని నమ్ముకుని బ్రతుకుతున్నాం. విత్తనం మొలకెత్తిన ప్పటి నుంచి పొలానికి నీళ్లు అందక ఇబ్బంది పడ్డాం. పంట పెరుగుతున్న సమయంలో వరదలు వచ్చి మొత్తం తుడిచిపెట్టుకుపోయింది. ఈ ఏడాది అంతా నష్టమే అని తంగెళ్లమూడికి చెందిన రైతు మత్తే రమేష్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

కోలుకోలేని నష్టం



15 రోజుల కిందట కురిసిన భారీ వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి వరదతో పొలాలు నీట మునిగి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. 15 ఎకరాలు కౌలుకు చేస్తున్నాను. కోలుకోలేని విధంగా నష్ట పోయాం. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి.

- యర్రాకుల బ్రహ్మయ్య, వీర నాయునిపాలెం, చేబ్రోలు మండలం

మడిలో కన్నీటి సుడి

- ముంపు తగ్గినా పంట దక్కే అవకాశం లేదు
- లక్ష ఎకరాలపైన నష్టం
- వాణిజ్య పంటలకు భారీ నష్టం
- ప్రభుత్వ సాయంపై అయోమయం

రైతులకు తీరని కష్టం

సాక్షి ప్రతినిధి, గుంటూరు : ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో జూన్‌లో నాట్లు వేయగా, జూలైలో వర్షాలు వచ్చి రైతులకు నష్టం జరిగింది. దీన్నుంచి కోలుకుని వెంటనే మరలా నాట్లు వేస్తే ఆగస్టు నెలాఖరికి వచ్చిన వరద ముంపు కారణంగా పంటలన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయి. పెదకాకాని మండలంలో ఎక్కువ మంది కౌలు రైతులు సంవత్సరానికి రూ.30 నుంచి 38 వేల వరకు పొలాలు కౌలు తీసుకొని పంటలు సాగు చేస్తున్నారు. మరోవైపు ఇప్పటి వరకూ ఎకరాకు పంటల సాగుకు రూ. 15 నుంచి 20 వేల వరకు ఖర్చు చేశామని, ఈ మొత్తం పోయిందని కేంద్ర బృందం ముందు కూడా రైతులు మొరపెట్టుకున్నారు. ముంపునకు గురైన పొలాల్లో డిసెంబర్ వరకూ ఎటువంటి పంటలు సాగు చేయడం కుదరదు. మళ్లీ రబీలోనే పంటలు సాగు చేయడం సాధ్యం అవుతుంది. అందువల్ల నష్టపోయిన తమను వెంటనే ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సాక్షి గ్రౌండ్ రిపోర్టు



తంగెళ్లమూడిలో వరద నీటిలో కుళ్లి పోతున్న పంట

కోలుకోలేని రైతులు

ఇప్పుడిప్పుడే పొలాల్లోని నీరు బయటకు వెళ్తున్నా, పంట పనికిరాని పరిస్థితికి చేరుకోవడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితిలో రైతులు ఉన్నారు. అధిక వర్షపాతం, ఎగువ నుంచి వైపు పంట కాల్వలను సకాలంలో ఆపకపోవడం, అత్యధిక వర్షపాతం కారణంగా పొంగి పొర్లాయి. గుంటూరు చానల్, హైలెవల్ చానల్, అప్పాపురం చానల్, కృష్ణా వెస్ట్రన్ కెనాల్‌తో పాటు డ్రైనేజీ కాల్వలకు కూడా గండ్లు పడ్డాయి. జిల్లా వ్యాప్తంగా మేజర్, మైనర్ గండ్లు సుమారు 237 పడ్డాయని అధికారులు చెబుతున్నారంటే ముంపు ఏ స్థాయిలో ఉందో అర్థం అవుతుంది.

74 వేల ఎకరాల్లో వరి మునక

జిల్లాలో 74 వేల ఎకరాల్లో వరి పంట ముంపుకు గురికాగా మరో 30 వేల ఎకరాల్లో ఉద్యాన వన, మిగిలిన పంటలు దెబ్బతిన్నాయి. వరద ముంపులో పంటలు ఆరు రోజుల వరకు పూర్తిగా మునిగిపోయాయి. జిల్లాలో ఆగస్టు 30,31 తేదీలలో 24 గంటల వ్యవధిలో సుమారు 220.3 ఎం.ఎం. వర్షం కురిసింది. దీంతోపాటు కృష్ణానదికి ఎన్నడూ లేనివిధంగా 11.43 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చింది. దీంతో 11 మండలాల్లోని 25 గ్రామాలు, నాలుగు పట్టణాల్లోని 38 వార్డులు వరద ముంపునకు గురయ్యాయి. కృష్ణా నదికి సమీపంలోని తుళ్లూరు, మంగళగిరి, కొల్లిపర మండలాల్లోని గ్రామాలు పూర్తిగా నీట మునిగాయి. పంటలకు తీవ్ర నష్టం జరిగింది. మరోవైపు పొన్నూరు, పెదకాకాని, చేబ్రోలు, వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు మండలాల్లో కూడా పంటలు బాగా దెబ్బతిన్నాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం జిల్లాలో వరద ముంపు వల్ల 29, 882 హెక్టార్లలో వరి, 2430 హెక్టార్లలో పత్తి, 688.6 హెక్టార్లలో మినుము, ఇతర పంటలు మొత్తం కలిపి 33210.6 హెక్టార్లలోని పంటలు నీట మునిగాయి. 49961 మంది రైతులకు నష్టం వాటిల్లింది. వరద నీటిలో నాలుగు నుంచి ఎనిమిది రోజులు పత్తి మునగడం వల్ల పూర్తిగా నష్టం జరిగింది. అరటి, కూరగాయలు, పసుపు, మిరప, బొప్పాయి, కంద తదితర పంటలు 4058.86 హెక్టార్లు నీట మునిగి, 6030 మంది రైతులకు నష్టం జరిగింది. అయితే, ఇప్పటివరకూ వ్యవసాయాధికారులు పూర్తిస్థాయిలో పంట నష్టం అంచనాలు వేయలేదు. మరోవైపు ప్రభుత్వం ఆదుకుంటామని చెబుతున్నా వారు ఇస్తామన్నది ఏ మాత్రం సరిపోదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిండా మునిగాం



వర్షాలకు పంట నీట మునిగిపోవడంతో పూర్తిగా నష్టపోయాం. క్షేత్ర స్థాయిలో పంట నష్టం అంచనాలు తయారు చేయడంలో వివక్ష చూపుతున్నారు. పది ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నా. పది రోజుల పాటు పొలంలో నీళ్ల నిల్వ ఉండటంతో మొక్కలు చచ్చిపోయాయి. ప్రభుత్వ సాయం వెంటనే అందించి ఆదుకోవాలి.

- తోక సాంబశివరావు, వీరనాయకునిపాలెం, చేబ్రోలు మండలం

కుళ్లిపోయింది



ఈ ఏడాది 11 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశా. భూమి యజమానులతో ఎకరానికి 18 బస్తాలు చొప్పున ధాన్యం ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నా. వరదల కారణంగా పొలం మొత్తం చెరువుగా మారింది. నీళ్లు బయటకు పోయినా పైరు చేతికి దక్కే పరిస్థితి లేదు.

-జ్యోతుల సురేష్, రైతు, తంగెళ్లమూడి

న్యూస్‌రీల్

క్రికెట్ మాజీ కెప్టెన్ అజయ్‌కుమార్‌రెడ్డికి సత్కారం



మాచర్ల: భారతదేశ అంధుల క్రికెట్ (బ్లైండ్) టీంకు కెప్టెన్‌గా వ్యవహరించి ఐదుసార్లు ప్రపంచ కప్ సాధించిన అజయ్‌కుమార్‌రెడ్డికి అత్యుత్తమ అర్జున అవార్డు అందించటం సంతోషకరమని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం మాచర్లకు వచ్చిన అజయ్‌కుమార్‌రెడ్డిని ఎమ్మెల్యే అభినందించి శాలువ కప్పి జ్ఞాపికను అందజేశారు. యువత అజయ్‌కుమార్‌రెడ్డిని స్ఫూర్తిగా తీసుకొని క్రీడలలో ముందుకెళ్లాలని ఆయన కోరారు.

త్వరలో బీఎస్ఎన్ఎల్ వైఫై రోమింగ్ సేవలు

నెహ్రూనగర్: బీఎస్ఎన్ఎల్ గుంటూరు బిజినెస్ ఏరియా(గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఒంగోలు జిల్లాలు) పరిధిలో ఫైబర్ టూ ది హోం వినియోగదారులందరికీ వైఫై రోమింగ్ సేవ త్వరలో ప్రారంభించనున్నట్లు గుంటూరు జీఎం సప్పవరపు శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఫై జోన్లలో రోమింగ్‌లో ఉన్నప్పుడు బీఎస్ఎన్ఎల్ కస్టమర్లకు ఇంట్లో, ఈ జోన్‌లలో తిరిగి కనెక్ట్ చేసుకొనే అవసరం లేకుండానే నిరంతరాయంగా ఇంటర్నెట్ సదుపాయాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. ఈ సేవల్ని పొందేందుకు దగ్గరలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

నేటి నుంచి సీతానగరం రామాలయ పవిత్రోత్సవాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం ఉపాలయమైన సీతానగరంలోని శ్రీ కోదండ రామస్వామి దేవస్థానంలో ఈ నెల 15 నుంచి 18 వరకు పవిత్రోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో నాలుగు రోజులు రాత్రి పూట ఆలయ ప్రాంగణంలో నిద్ర చేసేందుకు భక్తులకు అనుమతి లేదని దేవస్థాన అధికారులు పేర్కొన్నారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలలో అన్ని ఆర్జిత సేవల్ని నిలుపుదల చేశారు. భక్తులకు స్వామి దర్శనం మాత్రమే కల్పిస్తారు.

పక్షపాతంపై ప్రశ్నిస్తే పరోక్షంగా పోలీసు కేసు

కొల్లూరు: కృష్ణా నది వరదలకు ముంపునకు గురై నష్టపోయిన గృహాల నమోదులో లోపాలను ప్రశ్నించడమే ఆ యువకుడి విషయంలో తప్పైపోయింది. దాడికి దిగారనే ఆరోపణతో టీడీపీ మద్దతుదారుడైన వ్యక్తి ఫిర్యాదుతో ఆ యువకుడిపై కేసు నమోదు చేసిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. మండలంలోని తిప్పలకట్టకు చెందిన వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడైన పెదపల్లి యశ్వంత్ విద్యాభ్యాసం పూర్తిచేసి నిరుద్యోగిగా గ్రామంలో జీవిస్తున్నారు. ఇటీవల వరదల కారణంగా ముంపునకు గురైన ఇళ్ల నమోదులో సంబంధిత బృందాలు పక్షపాత వైఖరి ప్రదర్శిస్తుండటంపై ప్రశ్నించారు. ముంపునకు గురైన అన్ని ఇళ్ల వివరాలు నమోదు చేయాలని బృంద సభ్యులను కోరారు. ఈ విషయం స్థానికంగా ఉన్న టీడీపీ నాయకులకు కంటగింపుగా మారింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం యశ్వంత్‌ను స్టేషన్‌కు తీసుకువెళ్లి శనివారం రాత్రి వరకు అక్కడే ఉంచారు. అతడిపై కేసు నమోదు చేశారు. కేసు విషయమై కొల్లూరు ఎస్ఐ జి. ఏడుకొండలు మాట్లాడుతూ.. గృహ నష్ట నమోదు విషయంపై ఫిర్యాదు అందలేదన్నారు. తిప్పలకట్ట ఎస్సీ ప్రాంతానికి చెందిన రాంబాబుపై యశ్వంత్ గొడవకు వెళ్లినట్లు బాధితుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామన్నారు. నిందితుడికి నోటీసులు ఇచ్చి పంపనున్నట్లు తెలిపారు.

సేవల్లో బెస్ట్.. అవార్డుల్లో ఫస్ట్

- మరోసారి తెనాలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి 'ముస్కాన్' అవార్డు
- భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఎంపిక
- ఏపీలో అత్యధిక స్కోరు సాధించిన జిల్లా ఆసుపత్రి
- మరో రెండు జాతీయ సర్టిఫికెట్లకు ఎంపిక



జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి నుంచి సర్టిఫికెట్లను స్వీకరిస్తున్న డాక్టర్ సౌభాగ్యవాణి, డాక్టర్ హనుమంతరావు (ఫైల్)

తెనాలి: ప్రజారోగ్య సౌకర్యాల్లో చిన్నారులకు స్నేహపూర్వక సేవల్ని అందించడానికి ఉద్దేశించిన 'ముస్కాన్'లో నిర్దేశించిన ప్రమాణాల్లో భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని జాతీయస్థాయి సెంట్రల్ క్వాలిటీ సూపర్‌వైజరీ కమిటీ సర్టిఫికెట్‌కు తెనాలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఎంపికైంది. దీంతోపాటు 'ఎన్‌క్వాస్', 'లక్ష్య' వంటి మరో రెండు జాతీయ సర్టిఫికెట్లను వరుసగా రెండో ఏడాది సాధించడం విశేషం. 2023లో నాణ్యతా ప్రమాణాల ఆధారంగా ఇటీవలే గౌరవాలు దక్కాయి.

2021లో ముస్కాన్ ప్రారంభం

కేంద్ర ప్రభుత్వం 2021లో 'ముస్కాన్'ను ప్రారంభించింది. పుట్టిన బిడ్డ నుంచి 12 ఏళ్ల వయసు వరకు చిన్నారులకు నాణ్యమైన స్నేహపూర్వక వైద్యసేవల్ని అందించేందుకు దీన్ని రూపకల్పన చేశారు. నవజాత శిశువులు, పిల్లల ఆరోగ్య పరిరక్షణ, మరణాల్ని తగ్గించడం 'ముస్కాన్' లక్ష్యం. పిల్లల శారీరక, మానసిక, సామాజిక అభివృద్ధి సహా పెరుగుదల, అభివృద్ధికి సంబంధించిన అన్ని కీలక అంశాల్ని ఇందులో పొందుపరిచారు. ముస్కాన్‌తో దేశంలో పిల్లల సంరక్షణ సేవల నాణ్యతలో స్పష్టమైన మెరుగుదలను సాధించాలనే కృషి కొనసాగుతోంది. ఆసుపత్రుల్లో సేవలు, సౌకర్యాల మెరుగుదలకు గత ప్రభుత్వం అందించిన తోడ్పాటుతో వైద్య ప్రమాణాలు మెరుగైన విషయం తెలిసిందే.

తెనాలి ఆసుపత్రికి అత్యధిక స్కోరు



భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ జాబితాలో ఆంధ్రప్రదేశ్‌లో అన్ని ప్రమాణాల కనుగుణంగా క్వాలిటీ సర్టిఫికేషన్‌ను సాధించిన ఆసుపత్రుల్లో తెనాలి ఆసుపత్రి అత్యధిక స్కోరులో నిలిచింది. ముస్కాన్ సర్టిఫికెట్‌కు కనీసం 70 శాతం స్కోర్ అవసరం కాగా తెనాలి జిల్లా ఆసుపత్రి, అన్నింటికంటే మిన్నగా 92 శాతం సాధించడం విశేషం. ఎస్ఎన్‌సీయూ, పీడియాట్రిక్ ఓపీడీ, ఐపీడీ, న్యూట్రిషన్, రిహాబిలిటేషన్‌లో ఈ ప్రమాణాలను సాధించారు. 2022 సంవత్సరానికి సంబంధించింది కూడా గతేడాది 'ముస్కాన్' అవార్డును ఇదే వైద్యశాల అందుకున్న విషయం తెలిసిందే.

సమష్టి కృషితోనే మెరుగైన సేవలు



సేవల నాణ్యతలో జిల్లా ఆసుపత్రికి దక్కిన విజయాలు గర్వకారణంగా ఉన్నాయి. వైద్యులు, వైద్య సిబ్బంది సమష్టి కృషి, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల తోడ్పాటుతో అన్ని విభాగాల్లో మెరుగైన సేవలను అందించగలుగుతున్నాం. ఈ కృషిని కొనసాగిస్తాం. రోగుల సేవలో నాణ్యతలో రాజీపడేది ఉండదు.

- డాక్టర్ సౌభాగ్యవాణి, సూపరింటెండెంట్

ఎన్‌క్వాస్, లక్ష్య సర్టిఫికెట్ల సాధన

సెకండరీ హెల్త్ సర్వీసెస్ ఆధ్వర్యంలోని తెనాలి జిల్లా ఆసుపత్రి ఇదే ఏడాది ఎన్‌క్వాస్, లక్ష్య, వంటి జాతీయ గుర్తింపు కలిగిన సర్టిఫికెట్లను సాధించింది. ప్రజారోగ్య సౌకర్యాల్లో ఏడు ప్రధాన విభాగాల్లో 74 స్టాండర్డ్స్, 808 చెక్‌పాయింట్స్ ఉంటాయి. ఆయా విభాగాల్లో యాక్సిడెంట్ అండ్ ఎమర్జన్సీ, బ్లడ్ బ్యాంక్, ఓపీడీ/ఐపీడీ, మెటర్నటీ వార్డ్, ఎస్ఎన్‌సీయూ, లేబరేటరీ, ఫార్మసీ, ఓటీ, రేడియాలజీ, పీపీ యూనిట్, మార్చురీ, జనరల్ అడ్మినిస్ట్రేషన్‌లోని చెక్ పాయింట్లలో మొత్తం 83 శాతం స్కోరుతో నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్వాస్) సర్టిఫికేషన్ గెలుచుకుంది. గర్భిణులు, అప్పుడే పుట్టిన బిడ్డలు, లేబర్ రూమ్, మెటర్నటీ ఓటీలో కనీసం 70 శాతం స్కోర్‌కుగాను తెనాలి ఆసుపత్రికి 93 శాతం స్కోర్‌తో 'లక్ష్య' జాతీయ సర్టిఫికెట్‌ను అందుకుంది. ఇటీవల గుంటూరులో జరిగిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి చేతులమీదుగా ఆయా సర్టిఫికెట్లను వైద్యాధికారులు స్వీకరించారు.

దెబ్బతిన్న రైల్వే బ్రిడ్జి కింద రక్షణ గోడ



తాడేపల్లి రూరల్: కృష్ణా కెనాల్ జంక్షన్ నుంచి విజయవాడ రైల్వే జంక్షన్‌కు వెళ్లే మార్గంలో కృష్ణా నది మీదున్న రైల్వే బ్రిడ్జి కింద రక్షణ గోడ (రివిట్‌మెంటు) నీటి ప్రవాహానికి పూర్తిగా దెబ్బతింది. ఇటీవల నదికి 11.50 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చింది. ప్రవాహానికి రెండు బ్రిడ్జిల గోడ కింద మట్టి నాని, రాళ్లు కిందకు జారాయి. రైల్వే అధికారులు వెంటనే స్పందించి వర్షాలు పడక ముందే బ్రిడ్జి కింద భాగాన్ని కాంక్రీట్‌తో నిర్మాణం చేపట్టాలని, లేనిపక్షంలో కోతకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు తెలిపారు.

రేపు పోలీస్ స్పందన రద్దు

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో ఈనెల 16న నిర్వహించాల్సిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'ను మిలాద్ ఉన్‌నబీ పండుగ పురస్కరించుకుని తాత్కాలికంగా రద్దు చేశారు. ఈ మేరకు డీపీఓ అధికార వర్గాలు శనివారం ఒక ప్రకటనలో తెలిపాయి. జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ఫిర్యాదిదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. గత నెల 26న నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను కృష్ణాష్టమి పండుగ సందర్భం గా రద్దు చేశారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా ఈనెల 2, 9 తేదిల్లో జరగాల్సిన వేదికను తాత్కలికంగా రద్దు చేశారు. దాదాపు నెల రోజుల్లో నాలుగు సోమవారాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

నినాదాలతో మార్మోగిన జీజీహెచ్ ప్రాంగణం



ర్యాలీగా నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ నర్సులు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు శనివారం ఆసుపత్రి చుట్టూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. నినాదాలతో ఆసుపత్రి ప్రాంగణం మారుమోగింది. ప్రభుత్వం ఈనెల 4న విడుదల చేసిన జీఓ నంబర్ 115ను రద్దు చేయాలని కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు డిమాండ్ చేశారు. విధులు బహిష్కరించి, నల్లబ్యాడ్జీలు ధరించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట ప్లకార్డులు చేతబట్టుకుని న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ప్రభుత్వం తమను రెగ్యులర్ చేసే వరకు నిరసనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. తమ డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చకపోతే మంగళవారం నుంచి అత్యవసరం మినహా సాధారణ వైద్యసేవలన్నీ బంద్ చేస్తామని హెచ్చరించారు. నిరసనలో ఆంధ్రప్రదేశ్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర నాయకులు స్వచ్ఛంద ప్రసాద్, పి.మనీష, జిల్లా అధ్యక్షురాలు రేణుక, సెక్రటరీ శివమ్మ, కోశాధికారి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు కోటేశ్వరి, సౌజన్య, కరుణ, జాయింట్ సెక్రటరీలు హైమావతి, సంధ్యా, మేరీ, రమాదేవి, సభ్యులు కుసుమ కుమారి, సుధారాణి పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **5,000** గరిష్ఠం : రూ. **7,200**

మోడల్ ధర రూ. **6,000**

క్లుప్తంగా

వలంటీర్ల సేవలపై తప్పుడు ఆరోపణలు తగదు

అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జంగాల చైతన్య

గుంటూరు ఎడ్యుకేషన్: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించిన వలంటీర్లపై పంచాయతీరాజ్ శాఖ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు, టీడీపీ నేత రాజేంద్రప్రసాద్ తప్పుడు ఆరోపణలు మానుకోవాలని ఏపీ స్టేట్ యూనియన్ వలంటరీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జంగాల చైతన్య శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఆయన వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కోవిడ్-19 సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు అందించిన సేవల్ని గుర్తు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వలంటీర్లకు రూ.10వేల వేతనం, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీల్ని తుంగలో తొక్కారని మండిపడ్డారు. తక్షణమే వలంటీర్లను విధుల్లోకి తీసుకుని, వేతనం పెంపుదలతో పాటు పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

పట్నంబజారు: పదో తరగతి విద్యార్థిని భయపెట్టి అత్యాచారానికి పాల్పడి గర్భిణిని చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తారకరామానగర్‌కు చెందిన పదో తరగతి విద్యార్థినిని అదే ప్రాంతంలో నివాసం ఉండే కార్ల పెయింటర్ షేక్ కాలేషా అ భయపెట్టి తన ఇంటిలో పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. అయితే, కొద్దిరోజుల కిందట విద్యార్థిని కడుపు నొప్పి అంటూ ఇబ్బంది పడుతుండటంతో తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు విద్యార్థిని మూడు నెలల గర్భం దాల్చి ఉందని తెలిపారు. విషయం ఆరా తీయడంతో కాలేషా తనపై పలు మార్లు అత్యాచారానికి పాల్పడినట్లు విద్యార్థిని తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు శారు. కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. ఈస్ట్ సబ్ డివిజన్ ఇన్‌చార్జి, దిశ డీఎస్పీ బి.వి.సుబ్బారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో 2,759 కేసులు పరిష్కారం

నగరంపాలెం: స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. న్యాయసేవాధికార సంస్థ జిల్లా చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి. పార్థసారథి పర్యవేక్షించారు. జిల్లా కార్యదర్శి, డివిజన్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) టి.లీలావతి, పలువురు న్యాయమూర్తులు పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా కోర్టుల్లోనూ లోక్‌అదాలత్ నిర్వహించారు. పలు న్యాయస్థానాల్లో పెండింగ్, రాజీ పడిన కేసులను పరిష్కరించారు. సివిల్ కేసులు 258, క్రిమినల్ కేసులు 1,898, చెక్ బౌన్స్ కేసులు 194, మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు 150, కార్మిక వివాద కేసులు ఏడు, వివాహ సంబంధ కేసులు 64, బ్యాంక్ కేసులు 56, ప్రీ-లిటిగేషన్ కేసులు 129 కలుపుకుని మొత్తం 2,759 పరిష్కరించారు. వీటి విలువ


లోక్ అదాలత్‌ను పర్యవేక్షిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి

రూ.47,13,11,302 అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి తెలిపారు. ఫిజికల్, వర్చువల్ పద్ధతిలో లోక్ అదాలత్ నిర్వహించేందుకు సహకరించిన న్యాయవాదులకు, పోలీస్ సిబ్బందికి, ప్రభుత్వ సంస్థలకు, కక్షిదారులకు, న్యాయస్థాన సిబ్బందిని అభినందించారు.

అన్ని అనుమతులతోనే గ్రీన్ గ్రేస్ నిర్మాణం

- బజరంగ్ అర్బన్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ అంబటి మురళీకృష్ణ
- పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల ఆరోపణలు అవాస్తవమని స్పష్టీకరణ

పొన్నూరు: ఇళ్ల కొనుగోలుదారులను భయభ్రాంతులకు గురి చేసేందుకే తమ సంస్థపై పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అవాస్తవ ఆరోపణలు చేశారని బజరంగ్ అర్బన్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. గుంటూరు నగరం పట్టాభిపురంలో నిర్మిస్తున్న గ్రీన్ గ్రేస్ గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టుకు సంబంధిత అన్ని శాఖల అనుమతులు ఉన్నాయని తెలిపారు. రెండు సెల్లార్లలో ఒక స్టిల్ట్, ఒక గ్రౌండ్, 14 ఫ్లోర్ల నిర్మాణం మున్సిపల్ కార్పొరేషన్ అనుమతి అనంతరం రెరా (రియల్ ఎస్టేట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్ట్) ప్రకారం రిజిస్ట్రేషన్ చేసి అనుమతి ఇచ్చినట్లు వివరించారు. శనివారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంబంధిత రైల్వే, ఎయిర్‌పోర్టు అథారిటీ, అగ్నిమాపక శాఖల ఎన్‌వోసీలు సమర్పించిన అనంతరమే మున్సిపల్ కార్పొరేషన్ 2020లో మొదటిగా అనుతించడం జరిగిందన్నారు. ఆ తరువాత రెరా ఈ ప్రాజెక్టును రిజిస్టర్ చేసి వ్యాపార లావాదేవీలు జరపడానికి అనుతించిందని వివరించారు. ఈ క్రమంలో నిర్మాణ దశలోఉండగానే కొన్ని మార్పుల కోసం మున్సిపల్ కార్పొరేషన్‌కు దరఖాస్తు చేయగా, జూన్ 2024న రివైజ్డ్ ప్లాన్‌కు అనుమతి కూడా వచ్చిందన్నారు. ఇప్పటి వరకు మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.5.5 కోట్లు, వివిధ శాఖలకు మరో రూ. 45 లక్షలు రుసుంగా చెల్లించినట్లు వివరించారు. మరో రూ. 2 కోట్లు బహుళ అంతస్తుల భవనానికి జీవో నెంబర్ 180 ప్రకారం ఆరు ఇన్‌స్టాల్‌మెంట్ల చొప్పున ప్రతి ఆరు నెలలకు ఒక ఇన్‌స్టాల్‌మెంట్ చెల్లించే అనుమతి మున్సిపల్ ప్రొసీడింగ్స్‌లో పొందుపరిచిన విషయాన్ని ఈ సందర్భంగా అంబటి మురళీ కృష్ణ గుర్తు చేశారు. ఈ వివరాలు అన్నీ కూడా ఆన్‌లైన్‌లో www.apdpms.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉన్నాయని చెబుతూ, ఎమ్మెల్యే నరేంద్ర లేదా ఎవరైనా వీటిని పరిశీలించవచ్చని, సంబంధిత పర్మిట్లు కూడా పొందుపరిచి ఉన్నాయని వివరించారు. కాగా,ఇటీవల జరిగిన ఎన్నికల్లో తాను వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నరేంద్రపై పోటీ చేసిన కారణంగానే ఈ తరహా ఆరోపణలు చేస్తున్నారని, అయితే వాటిల్లో వాస్తవం లేదని అంబటి మురళీకృష్ణ తెలిపారు.


ఏపీ రెరా అనుమతి పత్రం

సలహాలు, సూచనలు పంపేందుకు నేడు చివరి రోజు

తాడేపల్లి రూరల్: వక్ఫ్ బోర్డు సవరణ-2024 బిల్లుపై కమిటీకి సలహాలు, సూచనలు పంపేందుకు ఈనెల 15వ తేదీ రాత్రి 12 గంటల వరకే అవకాశం ఉందని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని తెలిపారు. దుగ్గిరాలలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఈ విషయాన్ని తెలిపిందని వివరించారు. అభిప్రాయాలు, సూచనలను httpr://tinyur.com/beljectwaqf bi 24 మెయిల్‌కు పంపాలని సూచించారు. ఇప్పటికీ తమ అభిప్రాయాలను తెలపని ముస్లింలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.


షేక్ సుభాని

తుళ్లూరులో నేటి నుంచి ఇసుక లోడింగ్

తాడికొండ: జిల్లాలోని తుళ్లూరు మండలం లింగాయపాలెం, తాళ్లాయపాలెం ఇసుక స్టాక్ యార్డుల్లో ఆదివారం నుంచి ఇసుక లోడింగ్‌కు అనుమతి ఇస్తున్నట్లు తహసీల్దార్ సుజాత తెలిపారు. లోడింగ్‌కు గత నెల 29 వరకు బుకింగ్ జరిగిందని పేర్కొన్నారు. అధిక వరదలతో తేదీల్లో మార్పులు చేసిన కారణంగా గతంలో లోడింగ్ చేసుకోకుండా ఉన్న లారీలకు ఆగస్టు 30 నుంచి సెప్టెంబరు 5వ తేదీ వరకు అనుమతి ఇచ్చినట్లు వివరించారు. ఆగస్టు 30న బుక్ చేసుకున్న వారికి సెప్టెంబరు 15, 16 తేదీల్లో, ఆగస్టు 31 బుక్ చేసుకున్న వారికి 17, 18 తేదీల్లో, సెప్టెంబరు 1న బుక్ చేసుకున్న వారికి 19, 20 తేదీల్లో, సెప్టెంబరు 2న వారికి 21, సెప్టెంబరు 3న బుక్ చేసుకున్న వారికి సెప్టెంబరు 22న, సెప్టెంబరు 4, 5న బుక్ చేసుకున్న వారికి 23 తేదీల్లో లోడింగ్ జరుగుతుందని ఆమె వివరించారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆమె కోరారు.

నేటి నుంచి అమరావతి నాట్యోత్సవం

నగరంపాలెం: కె.ఆర్.కె.ఎం.మెమోరియల్ అకాడమి ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ గుంటూరు ఆధ్వర్యంలో ఈనెల 15, 16 తేదీల్లో అమరావతి నాట్యోత్సవం-2024 (భారతీయ నాట్యరీతుల సమ్మేళనం) నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి కోకా విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై సాయంత్రం ప్రారంభమవుతాయని చెప్పారు. కూచిపూడి, భరత నాట్యం, ఆంధ్ర నాట్యం, కథక్, పేరిణి నాట్యం తదితర అనేక నృత్య ప్రదర్శనలు జరుగుతాయని పేర్కొన్నారు. కళాభిమానులు హాజరుకావాలని ఆమె కోరారు.

కాల్వలో యువకుడి మృతదేహం లభ్యం

వేటపాలెం: స్ట్రయిట్ కట్ కాల్వలో యువకుడి మృతదేహం శనివారం వెలుగుచూసింది. పోలీసుల వివరాల మేరకు.. రామన్నపేట పంచాయతీ ఇందిరా కాలనీకి చెందిన లక్ష్మణాచారి (18) చీరాలలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. రోజూ చీరాల వెళ్లి వస్తుంటాడు. ఈ క్రమంలో లక్ష్మణాచారి డ్రగ్స్‌కి బానిసయ్యాడు. ఒక్కోసారి రెండు మూడు రోజుల తరువాత ఇంటికి వస్తుండేవాడు. ఈ నెల 4వ తేదీన చీరాల వెళ్లి తిరిగి రాలేదు. 6వ తేదీన అతడి మోటార్ బైక్ బైపాస్ రోడ్డు దగ్గరలో రోడ్డు పక్కన ఉండటాన్ని స్నేహితులు గుర్తించారు. బైకును ఇంటికి తెచ్చి ఇచ్చారు. యువకుడి తండ్రి రాఘవాచారి అతడి ఆచూకీ కోసం వెతుకుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం యువకుడు బైక్ వదిలి వచ్చిన ప్రాంతంలో స్ట్రయిట్ కట్ కాల్వ వద్ద నీటిలో కొడుకు మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని చీరాల రూరల్ సీఐ ఎన్.సత్యనారాయణ, ఎస్సై ఎం. వెంకటేశ్వర్లు పరిశీలించారు. మృతదేహాన్ని కాల్వ నీటి నుంచి బయటికి తీయించారు. అతడు కాలవలో పడి దాదాపు పది రోజులై ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు అనుమానిత మృతి కేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయం కేసులో ముగ్గురు అరెస్టు

- పరారీలో మరో ఇద్దరు
- కిలోన్నర గంజాయి, నాలుగు బైక్‌లు స్వాధీనం

తెనాలి రూరల్: గంజాయి అమ్మకంతో తో పాటు బైక్‌ల చోరీలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. కిలోన్నర గంజాయి, నాలుగు బైక్‌లను స్వాధీన పర్చుకున్నారు. తెనాలి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిందితుల వివరాల్ని డీఎస్పీ బి. జనార్దనరావు తెలియజేశారు. పట్టణంలోని ఐతానగర్ కు చెందిన రావుత్ సల్మాం స్నేహితుడు ప్రభాస్‌తో కలసి అరకులో గంజాయి కొనుగోలు చేసి, తెనాలి తీసుకువచ్చి చిన్న పొట్లాలుగా చేసి అమ్ముతున్నారు. స్థానక చినపరిమి వెళ్లే డొంకలో రావుత్ సల్మాన్ రజకపేటకు చెందిన మునిపల్లి సుబ్బారావు, మారిస్‌పేటకు చెందిన కోళ్ల మహేష్, మరో ఇద్దరు గంజాయితో ఉన్నారన్న సమాచారంతో త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. ఇందులో రావుత్ సల్మాన్ మునిపల్లి సుబ్బారావు, కోళ్ల మహేష్ పట్టుబడగా మరో ఇద్దరు పరారయ్యారు. పట్టుబడిన ముగ్గురి నుంచి కిలోన్నర గంజాయితో పాటు చోరీ చేసిన నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ. 30 వేలు ఉంటుందని డీఎస్పీ తెలిపారు. గంజాయి విక్రయిస్తున్నా, కలిగి ఉన్నా కఠినమైన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. కేసులో నిందితుల్ని అరెస్టు చేసిన సీఐ రమేష్ బాబు, ఎస్ఐ ఎన్. ప్రకాశరావు, సిబ్బంది పి. మురళి, డి. సురేష్, జి. నరేంద్ర, సీహెచ్. శ్రీరామమూర్తిలను ఆయన అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్దనరావు

స్కూల్ గేమ్స్ కార్యనిర్వాహక కార్యదర్శిగా నరసింహారావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యనిర్వాహక కార్యదర్శిగా సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకుడు గుంటూరు నరసింహారావు నియమితులయ్యారు. జిల్లా వృత్తి విద్యాధికారి జె.పద్మ అధ్యక్షతన ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లా జూనియర్ కళాశాలల వ్యాయామ ఉపాధ్యాయుల సర్వసభ్య సమావేశంలో అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు నరసింహారావు శనివారం తెలిపారు. సహాయ కార్యదర్శిగా తెనాలిలోని అంబేడ్కర్ జూనియర్ కళాశాల పీడీ సీహెచ్ పద్మాకర్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. ఇద్దరికీ జిల్లాలోని వ్యాయామ అధ్యాపకులు ఎస్. సుధాకర్‌రెడ్డి, షేక్ మస్తాన్‌వలి, రాజు, మురళీకృష్ణ, శివరామకృష్ణ, ఆదిశేషు, రాజశేఖర్ అభినందనలు తెలియజేశారు.



మైనర్లపై అత్యాచారయత్నాలు

ఇద్దరిపై కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు

మంగళగిరి: నియోజకవర్గంలో 24 గంటల వ్యవధిలో ముగ్గురు మైనర్లను కామాంధులు చెరపట్టిన ఘటన చోటు చేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.

- మంగళగిరి పరిధిలోని రత్నాలచెరువులో గల బీఎస్ఆర్ ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న మైనర్‌పై అదే ప్రాంతానికి చెందిన వెంకటేశ్వరరావు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. శుక్రవారం ఉదయం బాలిక తల్లితండ్రులు పనికి వెళ్లగా ఒంటరిగా నిద్రపోతున్న ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఇంతలో నిద్ర లేచిన బాలిక బిగ్గరగా అరుస్తూ బయటకు పరిగెత్తి పక్కింటి వారికి విషయం చెప్పి విలపించింది. సమాచారం అందుకున్న బాలిక తల్లితండ్రులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంకటేశ్వరరావును అదుపులోకి తీసుకున్న పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు.
- బాలాజీనగర్‌లో ఏడు సంవత్సారాల బాలికపై అదే ప్రాంతానికి చెందిన 60 సంవత్సారాల చింతకింది వెంకటేశ్వరరావు అత్యాచారానికి యత్నించాడు. ఈలోపు బాలిక తల్లితండ్రులు రావడంతో పరారయ్యాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు వెంకటేశ్వరరావుపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలిక కిడ్నాప్ కేసులో యువకుడి అరెస్టు

ఆత్మకూరుకు చెందిన రూపేంద్ర ప్రభు పెదకాకానికి చెందిన ఓ వ్యక్తి కుమార్తెను ప్రేమించానని వేధిస్తున్నాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అతడ్ని హెచ్చరించారు. అయినా పట్టించుకోకుండా ఇంట్లో ఎవరు లేని సమయంలో బాలికను ద్విచక్ర వాహనంపై బలవంతంగా ఎక్కించుకుని కిడ్నాప్‌నకు యత్నించాడు. సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు.

జయములివ్వు బొజ్జ గణేశా !

8వ రోజు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

సత్తెనపల్లి: వినాయక నవరాత్రుల్లో భాగంగా పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని నాగార్జుననగర్‌లో గల శ్రీశ్రీ నగర్‌లో ఏర్పాటు చేసిన 61 అడుగుల మట్టి వినాయక విగ్రహం వద్ద శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ సత్యసాయి యువజన సంఘం ఆధ్వర్యంలో సినీ ఆర్ట్ డైరెక్టర్ వీరాంజనేయులు పర్యవేక్షణలో వినాయక నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా 8వ రోజు శనివారం 61 అడుగుల మట్టి వినాయక విగ్రహం వద్ద భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఆటంకం కలగకుండా శ్రీ సత్య సాయి యువజన సంఘం అధ్యక్షుడు సాయితేజ రాజు నేతృత్వంలో కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. తొమ్మిదో రోజు ఆదివారం నిమజ్జనం చేయనున్నట్లు తెలిపారు.

సత్తెనపల్లిలో పూజలందుకున్న 61 అడుగులు మట్టి వినాయకుడు



19 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు మండల స్థాయి క్రీడా పోటీల్ని నిర్వహించనున్నట్లు గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి మల్లంపూడి రవి పేర్కొన్నారు. పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్ష భవన్‌లో శుక్రవారం పోటీల నిర్వహణపై మండల, నియోజకవర్గ సమన్వయకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రవి మాట్లాడుతూ కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, చెస్, యోగా, షటిల్ బ్యాడ్మింటన్ అంశాల్లో టోర్నమెంట్ కం సెలక్షన్స్ నిర్వహించాలని సూచించారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు ఈనెల 24,25,26వ తేదీల్లో నియోజకవర్గస్థాయిలో పోటీల్ని నిర్వహించి, ఎంపికైన వారిని జిల్లాస్థాయి పోటీలకు పంపాలని వివరించారు.


మాట్లాడుతున్న మల్లంపూడి రవి